


# బ్రహ్మముడి

న్యాయపతి రాజగోపాలం

పాపం ఆవూరు కూడా ఒక బస్తీ కావాలని ప్రయత్నిస్తోంది. కాని రెండు మైళ్ల దూరంలో ఒక పెద్ద టవును ఉండడం నుంచి అది అభివృద్ధి కాలేకపోతున్నది. ప్రయత్నించగా యిప్పటికి ఒక రోడ్డు అంటూ ఏర్పడ్డది. ఎలక్ట్రిక్ స్తంభాలు పాతుతున్నారు. ఈ సంవత్సరమే మిడిల్ స్కూలు తెరిచారు కూడా.

ఆ మిడిల్ స్కూలు కోసం కొత్తగా వేసిన సిబ్బందిలో రాజేశ్వరరావు ఒకడు. బి. ఇడి., ప్యాసయిన వాడే. కాని ప్రస్తుతం ఏ హైస్కూళ్లలోనూ ఖాళీలు లేవని జిల్లా పరిషత్తువారు అతడిని మిడిల్ స్కూలులో ఒక ఉపాధ్యాయుడిగా వేశారు. ఏదో ఒక ఉద్యోగం అంటూ దొరికితే చాలు అని సంతోషిస్తూ రాజేశ్వరరావు ప్రవేశించాడు.

కాని,ఆవూరు చూడగానే అతడి సంతోషం సగం సన్నగిల్లింది. అక్కడ అతడికి బస దొరకలేదు. హొటళ్లు అసలు లేనేలేవు. అందుచేత టవున్లో నివసిస్తూ, రాను పోను నాలుగుమైళ్లు నడుస్తూ కొన్నాళ్లు కాలక్షేపం చేశాడు. కాని హెడ్మాష్టరు అభ్యంతరం తెల్పాడు. (అతడికి మాత్రం ఆ ఊళ్లో ఒక ఇల్లు ఇచ్చారు.) ఇంకో వూళ్లో ఉంటూ ఇక్కడ ఉద్యోగం చెయ్యడానికి వీలులేదు అన్నాడు. ఏమిటి చెయ్యడమో తోచని రాజేశ్వరరావుకి అదృష్టం కొద్దీ సుబ్బరాజు ఇంట్లో వసతి కుదిరింది.

సుబ్బరాజు భార్య మరణించి చాలా సంవత్సరా అయింది. అతడికి ఒక్క కూతురు ఒక్క కొడుకు ఉన్నారు. కొడుక్కి మెడికల్ కాలేజిలో సీటు రావడం, కొమార్తెకు ఈమధ్య పెళ్లి కావడంతో సుబ్బరాజు ప్రస్తుతం ఒక్కడే మిగిలాడు. రాజేశ్వరరావుకి ఒక గది యిచ్చాడు. వంట చేసుకోవడానికి ఒక పంచపాళీ కూడా ఇచ్చాడు. రాజేశ్వరరావుకి ఇంకా పెళ్లి కాలేదు. అందుచేత అటు భార్య పోయినవాడు, ఇటు భార్య రానివాడు వంట చేసుకొనేవారు. ప్రతిరోజు పాలు, రాయిలాంటి పెరుగు సుబ్బరాజు ఇచ్చేవాడు. దానితో రాజేశ్వరరావు దేహం నెలకి కిలోగ్రామం చొప్పున బరువు ఎక్కువ అవుతున్నది.

రామయ్యగారు ఆవూరి పెద్దమనుష్యులలో ఒకరు. సుబ్బరాజుకి దూరపు బంధువు కూడా. అయితే సుబ్బరాజు అదో రకం మనిషి. ఎప్పుడూ దేని గురించో విచారిస్తున్నట్టే కనబడతాడు. మితభాషి. ఒకరి విషయాలు పట్టించుకోడు. నలుగురితో కలిసి మెలిసి తిరగడం అతడికి అలవాటులేదు. అతడు ఎన్నడూ రామయ్య

గారి ఇంటికి వెళ్ళేవాడు.కాదు. కాని కొడుకుని పెద్ద చదువుకి పంపడానికి, కొమార్తెకి పెళ్ళి చెయ్యడానికి అతడు పెద్ద మొత్తం అప్పు చెయ్యాల్సి వచ్చింది. అంత మొత్తం అప్పు ఇవ్వగలిగిన స్తోమత ఆవూళ్ళో ఒక్క రామయ్యగారికే ఉన్నది. అప్పటినుండి సుబ్బరాజుకి రామయ్యగారి ఇంటికి తరచు వెళ్ళవలసిన అవసరం కలుగుతూనే ఉన్నది.

ఒకసారి రామయ్యగారింటికి వెళ్ళి వచ్చాక సుబ్బరాజు రాజేశ్వరరావుతో చెప్పాడు. —తమ రెండవ కొమార్తె హేమలతకి ప్రయివేటు ట్యూషను చెప్పమని రామయ్యగారు కోరుతున్నారని.

మంచిరోజు చూచి రాజేశ్వరరావు హేమలతకి చదువు చెప్పడం ప్రారంభించాడు. ప్రతిరోజు రామయ్యగారింటికి వెళ్ళడంతో అతడికి, స్వర్ణలతకి ఒకరిపైన ఒకరికి ప్రేమ జనించింది.

స్వర్ణలత రామయ్యగారి పెద్ద అమ్మాయి ఎనిమిదవ తరగతి వరకు చదువుకొన్నది. ఆ తర్వాత రామయ్యగారు ఆమెను ఎక్కడికీ పంపించి పెద్ద చదువు చెప్పించలేదు. నాలుగేళ్ళనుండి ఇంటివద్దనే కూర్చొన్నది.

స్వర్ణకి పెళ్ళి చెయ్యాలని రామయ్యగారు ఆయన భార్య పార్వతమ్మ రెండు సంవత్సరాల నుండి ఉవ్విళ్ళూరుతున్నారు. అయితే రామయ్యగారి చెల్లెలు జగదాంబ వలనపైన వారు నిదానించవలసి వచ్చింది.

జగదాంబకి పదిహేనవ ఏట వివాహం జరగడం, ఇరవై అయిదవ ఏట భర్త మరణించటం జరిగాయి. భర్త పోయినప్పటి నుండి ఆమె అన్నగారి వద్దనే ఉంటున్నది. ఇప్పటికి పది సంవత్సరాలయింది. క్రమంగా అన్ని అధికారాలు సంపాదించి ఇప్పుడు రామయ్యగారి ఇంటికి ఆమె పూర్తిగా యజమానురాలయింది.

జగదాంబ చాలా అందంగా ఉంటుంది. ఆమెకు వైధవ్యం భగవంతుడు ఎలా వ్రాశాడా అని అందరికీ ఆశ్చర్యమే. చూచినవాళ్ళెవరూ ఆమెకు ముప్ఫయి అయిదు సంవత్సరాల వయస్సు ఉన్నదంటే నమ్మలేరు. స్వర్ణ, హేమ, జగదాంబ అక్క చెల్లెళ్ళలా కనిపిస్తారు. భర్త చనిపోయినప్పటినుండి జగదాంబకి భక్తి, మడి, తడి ఆచారం మరీ ఎక్కువ అయినై. నిప్పులాంటి మనిషి అని పేరు తెచ్చుకొన్నది.

తన బావగారి కొడుక్కి స్వర్ణ నిచ్చి వివాహం చెయ్యాలని జగదాంబ సంకల్పం. ఈ విషయంలో ఇదివరకే కొంతవరకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఒకసారి ఆమె వెళ్ళి వచ్చింది కూడా. అబ్బాయి చదువు పూర్తి కావాలని, అంతవరకు వివాహం చెయ్యదలచుకోలేదని వాళ్ళు చెప్పారు. ఆ తర్వాత తప్పకుండా స్వర్ణని చేసుకొంటామని హామీ యిచ్చారు. అందువాత అబ్బాయి చదువు పూర్తి అయ్యేవరకు స్వర్ణని కూర్చోబెట్టవలసి వచ్చింది. మొన్నటితో అతడి చదువు పూర్తి అయింది. తిరిగి ఉత్తరాలు ప్రారంభించాయి. వాళ్ళ అబ్బాయి స్వర్ణని చూచి ఇష్టపడితే చేసుకొంటామనే కొత్త షరతుతో జవాబు వచ్చింది. ఫలానా నాడు వస్తున్నాడని రెండుసార్లు వ్రాశారు కూడా. కాని ఆ రెండు ఫలానా నాళ్ళకి అబ్బాయి రాలేదు. అది రామయ్యగారికి, పార్వతమ్మకి కొంత నిరుత్సాహం కలిగించింది. కాని జగదాంబ మాత్రం ధైర్యంగానే ఉన్నది.

* * *

ఒకరోజు హేమలత "అమ్మా, అమ్మా, అక్కయ్య, ప్రయివేటు మాష్టరు పెళ్ళి చేసుకొంటారట" అని తల్లితో చెప్పింది.

పార్వతమ్మ నిర్ఘాంత పోయింది. "ఛీ, ఏమిటా మాటలు" అన్నది.

"లేదమ్మా, వాళ్ళు అనుకొంటూంటే నేను విన్నాను" అన్నది హేమ.

"ఎప్పుడు ?" అని పార్వతమ్మ అడిగింది.

"ఇందాకట. నేను చావిట్లో మంచం వెనక కూర్చొని ఆడుకొంటున్నాను. ఇంతలో రాజేశ్వరరావు మాష్టరు వచ్చారు. నేను కనబడకపోతే వెళ్ళిపోతారు కదా అని మాట్లాడకుండా అక్కడే కూర్చొన్నాను. ఇంతలో అక్కయ్య వచ్చింది. ఇద్దరూ మాట్లాడుకొన్నారు. అక్క ఇంకెవ్వరినీ పెళ్ళి చేసుకోదటమ్మా! ప్రయివేటు మాష్టారినే చేసుకొంటానని ఆయనతో చెప్పింది. నేను విన్నానమ్మా" అని చెప్పింది హేమ.

"మా గొప్పపని చేశావు కాని ఈమాటలు ఎవ్వరితో చెప్పవద్దు. ముఖ్యంగా అత్తయ్యతో చెప్పవద్దు. చెప్పావా నీ దవడ వాయగొడతాను. పోయి ఆడుకో" అన్నది పార్వతమ్మ.

హేమ వెళ్ళాక స్వర్ణని పిలిచి 'ఏమిటే ఇదంతా ? నువ్వు రాజేశ్వరరావుని పెళ్ళి చేసుకొంటానని అన్నావట?" అని అడిగింది.

స్వర్ణ తెల్లబోయింది. "నే నెవ్వరితోనూ చెప్పలేదే. నీకు ఎవరు చెప్పారమ్మా" అని అడిగింది.

హేమలత చెప్పినదంతా పార్వతమ్మ ఆమెకు చెప్పింది. "నిజమేనా ?" అని అడిగింది.

స్వర్ణ ఒక్క క్షణం మౌనంగా ఉన్నది.

"అవునమ్మా. హేమ చెప్పింది. నిజమే" అన్నది చివరికి.

"నీకు ఇంకొక సంబంధం ఇంచుమించు స్థిరపడింది. ఇప్పుడు ఆ రాజేశ్వరరావుతో రహస్యంగా మాట్లాడడం, పెళ్ళి చేసుకొంటాననడం ఏమైనా బాగుందా? లోకానికి తెలిస్తే ఏమనుకొంటుంది?" అని తల్లి మందలించింది.

"లేదమ్మా. నేను మాస్టారినే పెళ్ళి చేసుకొంటాను. ఆ తెలియని బావ ఎవరో నాకు వద్దమ్మా. ఎలాగో చెప్పి నాన్నగారిని కూడా నువ్వే ఒప్పించాలమ్మా. లేకపోతే ఇక నా బ్రతుకంతా ఏడుపే" అన్నది స్వర్ణ కంట నీరు పెట్టుకొంటూ.

"నువ్వు చిన్నపిల్లవి. నీకు తెలియదు. పెద్దవాళ్ళు అన్నీ ఆలోచించే నిర్ణయిస్తారు. ఆ రాజేశ్వరరావుకి ఈ ఉద్యోగం తప్ప ఇంకేవిధమైన ఆస్తి లేదని మీ నాన్నగారితో ఇదివరకు చెప్పాడట. అత్తయ్య తరఫు వాళ్ళు మంచి స్థితిగతులలో ఉన్నారట. ఏదైనా నీ ఉద్దేశం ఇలా ఉన్నదని నాన్నగారితో చెప్తానులే. ఆ పిమ్మట వారి ఇష్టం, వారి చెల్లెలుగారి ఇష్టం, నీ ప్రాప్తమూను," అన్నది పార్వతమ్మ.




ఒకరి శిరోజ సౌందర్యంచూచి
మరొకరు ఇక ఎంతమాత్రం
అసూయపడవలసిన అవసరం
లేదు. రీటా వాడి మీ కురుల
సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.




రీటో కంపెనీ, మద్రాసు 1

R-22.TO






విజయవాడ [illegible]



## ఇవి చదివేరా?

విద్యాదర్శిని:- మీ పిల్లల బాగుకు పనికివచ్చే కొన్ని వందల ఉపయోగ విద్యా వివరాలు రూ.5 00

చేతిపనులు - ధనసంపాదనకు పనికివచ్చే అనేక వందల మంచిసరుకులుచేసే సులభ మార్గాలు రూ3 50

మంత్రశక్తి - మీకోర్కెలు సిద్ధింపజేసే అనేక మంత్రాలు వాటి గోప్యరహస్యాలు, సాధన మార్గాలు రూ3 50

జీవిత రహస్యాలు - మీదాంపత్యసుఖానికి వెంటనే తెలుసుకోదగ్గ అనేక కామ సూత్రాలు రూ 3 50

యువతి:- స్త్రీలనుగురించి తెలుసుకోదగ్గ అనేక మంచి కుతూహల విషయాలు రూ 3 50

సంతానము - అవసరం లేనపుడు గర్భం రాకుండా 60 నవీన సులభ మార్గాలు రూ 3 50

పోస్టుఖర్చులుచేరిస్తాం దేవసేన ప్రచురణలు,ఏలూరు, ఆంధ్రకు ప్రాప్తి వి పి పోస్టుద్వారా పంపబడును


# బ్రహ్మాముడి

ఆ రాత్రి రామయ్యగారితో ఈ విషయమంతా పార్వతమ్మ చెప్పింది. రాజేశ్వరరావుకే స్వర్ణనిచ్చి వివాహం చేస్తే మంచిదని వాదించింది. రామయ్యగారు కూడా చివరికి ఇష్టపడ్డారు. కాని జగదాంబ ఏమంటుందో అన్న భయం మాత్రం ఆయనకి లేకపోలేదు.

*　*　*

సుబ్బరాజుతో క్రమంగా రాజేశ్వరరావుకి మైత్రి కలిగింది. అతడు ముభావం మనిషే కాని మెత్తటి గుండె కలవాడు, మంచివాడు అని రాజేశ్వరరావు గ్రహించాడు. సుబ్బరాజు కూడా అతడితో హృదయం విప్పి మాట్లాడేవాడు.

"మీరు రెండవ వివాహం చేసుకోలేదేం ?" అని ఒకసారి రాజేశ్వరరావును ప్రశ్నించాడు.

"ఆ ఇద్దరు పిల్లల్ని నాకు అప్పజెప్పి నా భార్య చనిపోయింది. వారికి ఏ లోటు రాకుండా పెంచే బాధ్యత నామీద పడ్డది. నేను ఇంకొక వివాహం చేసుకోవడం గురించి యోచించడానికే అవకాశం లేకపోయింది. ఎంత మంచి ఆడదైనా సవతి పిల్లల్ని అభిమానంతో చూస్తుందా?" అన్నాడు సుబ్బరాజు.

"మీ బాధ్యత మీరు పూర్తిగా నిర్వహించారు. దైవానుగ్రహంవలన పిల్లలు ఇద్దరు పెద్దవాళ్ళయినారు. పోనీ ఇప్పుడు చేసుకొంటేనేం ?" అన్నాడు రాజేశ్వరం.

సుబ్బరాజు ఆశ్చర్యంగా చూశాడు. "ఈ వయస్సులో నాకు పెళ్ళేమిటండీ?" అన్నాడు.

"మరీ పిల్లలు అయినట్టు మాట్లాడతారేం? మీకు పట్టుమని నలభై సంవత్సరాలు కూడా ఉండవు" అన్నాడు రాజేశ్వరరావు.

"నాకు ఇప్పుడు నలభై మూడు" అన్నాడు సుబ్బరాజు.

"నలభై మూడేళ్ళకే ముసలివాళ్ళయిపోయారా ? మీరు చాలా దృఢంగా ఉన్నారు. నలభై సంవత్సరాలలోపు వాళ్ళలా కనపడతారు. మీ వయస్సులో శాస్త్రులు కొందరు ఇంకా తొలిసారి వివాహమే చేసుకోరు" అన్నాడు రాజేశ్వరరావు.

"మా అమ్మాయి కూడా అత్తవారింటికి వెళ్తున్నప్పుడు ఇటువంటి సూచనే ఒకటి చేసిందండి. కాని నేను అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు నేను వివాహం చేసుకోవాలంటే చాలా చికాకులున్నాయి. నా కొమార్తె ఈడుగల అమ్మాయిని నేను వివాహం చేసుకోలేను కదా! కనీసం ముప్ఫయి, ముప్ఫయి అయిదు సంవత్సరాల వయస్సుగల స్త్రీ కావాలి. అంత వయస్సుగల స్త్రీ [illegible] దొరుకుతుంది? ఎవరైనా విధవ[illegible] చేసుకోవాలి. పట్నాలలో అటువంటివి జరుగుతున్నట్టు మనం వింటున్నామనుకోండి. కాని ఇటువంటి పూళ్ళల్లో ఎక్కడా జరగలేదు. అటువంటి పని తలపెట్టడానికి నాకు ధైర్యమూ చాలదు. ఏ స్త్రీ అంగీకరించినా అంగీకరించదు" అన్నాడు సుబ్బరాజు.

సుబ్బరాజు మాట్లాడుతున్నప్పుడే లోపడి మనస్సులో తటాలున ఒక మెరుపు మెరిసింది—ఈ లక్షణాలన్నిటికి సరిపోయింది జగదాంబేనని. అసలు మొదట్లో జగదాంబని తనకే యిచ్చి వివాహం చెయ్యాలనుకొనేవారు. ఇద్దరిని ఒకచోట నిలబెట్టి ఈడు జోడు బాగుందని అనుకొనేవారు. ఆ చిన్నతనపు రోజులలో జగదాంబ తనని మాస్టారు [illegible] పిలిచేది. కాని ఆ వివాహం జరగలేదు. రెండు కుటుంబాలకి మధ్య ఏవో గొడవలు వచ్చాయి. దానితో జగదాంబను ఎవరికో యిచ్చి వాళ్ళు వివాహం చేశారు. తనకు ఇంకొక సంబంధం [illegible] స్థిర పరిచారు.

కాని జగదాంబ భర్త చనిపోయాడు. తన భార్య చనిపోయింది. ఇప్పుడు [illegible] పరిస్థితి మళ్ళా మొదటికి వచ్చింది. తనకి యిద్దరు పిల్లలు ఉన్నమాట వాస్తవం. కాని ఇద్దరూ పెద్దవాళ్ళయ్యారు. ఎవరి దారిన వారు పోయారు. ఇన్నాళ్ళకి తిరిగి తిరిగి తనకి స్వేచ్ఛ లభించింది. ఇప్పుడు జగదాంబని వివాహం చేసుకొంటేనేం ? తెగిపోయిన తీగెలు తిరిగి వెనవేసుకొంటేనేం ?

ఈ మధ్య తను రామయ్యగారింటికి తరచు వెళ్ళడం సంభవించింది. జగదాంబ తనతో ఎంతో కుతూహలంగా మాట్లాడింది స్వల్ప వడ్డీతో అంత పెద్ద మొత్తం రామయ్యగారు తనకి అప్పు ఇవ్వడంలో కూడా జగదాంబ ప్రమేయం కొంత ఉన్నట్టు తనకి తెలిసింది. ఆమెకి ఇంకా తన పైన మక్కువ ఉన్నట్టే కనబడుతోంది. సూచనప్రాయంగా ఆమెను ఒకసారి అడిగి చూస్తే?

కాని అలా అడగడానికి సుబ్బరాజుకి ధైర్యం చాలడంలేదు. అందులో అతడికి ఒక పెద్ద ప్రమాదం కన్పించింది. జగదాంబ నిప్పువంటి మనిషి అని పేరు తెచ్చుకొన్నది. పైగా కొద్ది నోరు విసురు గల మనిషి. తను చెప్పిందంతా విని 'నాకు ఇష్టంలేదు' అని ఆమె మర్యాదగా చెప్పిందా కొంత నయం. కాని గొడవ చేసిందా ఇక ఆ వూళ్ళో తను తల ఎత్తుకొని తిరగలేడు. పైగా తను అప్పు పుచ్చుకొన్న పైకం అంతా వెంటనే తీర్చమని రామయ్యగారు తనపైన ఒత్తిడి తీసుకు రావచ్చును. జగదాంబకి తన యెడల ఎట్టి ఉద్దేశం ఉన్నదో ఆమె నోటినుండే వెలువడ రావాలి. తను ఎంతమాత్రం ఆమెతో ఈ ప్రస్తావన తేవదీయకూడదని సుబ్బరాజు నిశ్చయించుకొన్నాడు.

తన ఇంటికి సుబ్బరాజు ఈమధ్య తరుచు రావడంతో జగదాంబకి అతడిపైన ఎన్నాళ్ళనుండో అణగారిన అనురాగం తిరిగి మొలకలెత్తింది. ఇప్పుడైనా అతడు తనని వివాహం చేసుకొంటే బాగుండునని ఆమెకి తోచింది.. కాని తను విధవ. ఇది వరకు తమకుటుంబాలలో స్త్రీలు ఎవరూ రెండవ వివాహం చేసుకోలేదు. అసలు ఆ వూళ్ళోనే ఇంతవరకు అటువంటివి జరగలేదు. అయితేనేం ? అన్నగారిపైన ఆధారపడకుండా సుబ్బరాజుని వివాహం చేసుకొని తన బ్రతుకు తను బ్రతకడంలో తప్పేముంది ? కాని తను ఈ వయస్సులో ఇంకొక వివాహం చేసుకొంటే లోకం నవ్వదా ? నవ్వని. తను తెగిస్తుంది. ఆ నవ్వే లోకం తనని పోషిస్తుందా? ఇవ్వాళ నవ్వుతుంది. రేపు మరిచిపోతుంది. ఇంతకీ సుబ్బరాజు అభిప్రాయం ఎలాగున్నదో ! స్వయంపాకం చేసుకొంటూ ఒంటరిగా కాలక్షేపం చెయ్యకపోతే అతడు తిరిగి ఇంకొక వివాహం చేసుకోకూడదూ? ఇలా ఉంటే వార్ధక్యంలో అతడిని ఎవరు చూస్తారు? దైవానుగ్రహం వలన తనని వివాహం చేసుకోవాలనే ఆలోచన అతడి మనస్సులో కలగాలి. కలుగుతుందనే ఆమె ఆశించింది. తమ చిన్నతనపు రోజులు, అప్పటి అనురాగాలు అతడి మనస్సులో నుండి తొలగలేదనే ఆమె నమ్మకం.

ఆ తర్వాత రెండు రోజులకే రామయ్యగారింటికి సుబ్బరాజు ఒకనాటి సాయంకాలం వచ్చాడు. జగదాంబ చావిట్లో ఉన్నది.

"రండి, రండి" అంటూ సంభ్రమంగా లేచింది.

"రామయ్య లేడా? వడ్డీ చెల్లిద్దామని వచ్చాను" అంటూ లోనికి వచ్చాడు సుబ్బరాజు.

"ఉన్నాడు. వస్తాడు కూర్చోండి" అంటూ "అన్నయ్యా నీకోసం సుబ్బరాజుగారు వచ్చారు" అని లోనికి కేకవేసింది జగదాంబ.

సుబ్బరాజు కూర్చొన్నాడు.


"మనుష్యులకి మమతలు, అభిమానాలు ముఖ్యంగాని డబ్బులో ఏమున్నది? ఈమాత్రము వడ్డీ చెల్లించడానికే మీరు శ్రమపడి రావాలా? పోనీ ఈవిధంగానైనా మా ఇంటికి ఇంకొకసారి వచ్చారు. అదే సంతోషం. పిల్లలవద్ద నుండి ఉత్తరాలు వస్తున్నాయా ?" అని కుశల ప్రశ్నలు వేసింది జగదాంబ.

"ఆ! ఈరోజే ఇద్దరివద్ద నుండి ఉత్తరాలు వచ్చాయి. ఏదో భగవంతుడి దయవల్ల ఇద్దరు క్షేమంగా ఉన్నారు" అన్నాడు సుబ్బరాజు.

"మీరే వంట చేసుకొంటున్నారా ?"

"ఏపాటు తప్పినా అది మాత్రం తప్పదు కదా? ఎంతో తంటాలు పడుతున్నాను."

"మీకు ఈడు మించిపోయిందా ? పెదవారా ? బంగారంలాగ ఇంకొక వివాహము చేసుకొంటే ఈ బాధలు మీరు



లేకపోయేకదా. ఇప్పుడు కాలు నొచ్చినా, చెయ్యి నొచ్చినా రెండవ దిక్కు లేకుండా పోయారు. సమయానికి పిల్లలు రాగలుగుతారా ? నేను ఇలా అడిగానని ఏమీ అనుకోకండి. మన చిన్నతనపు చనువు పురస్కరించుకొని, మీ మేలు కోరేదానిని కాబట్టి అంటున్నాను'' అన్నది జగదాంబ.

''ఆమాట నిజమే. కాని నేను కొన్ని కారణాల నుండి అప్పట్లో ద్వితీయ వివాహం తలపెట్టలేదు. ఇప్పుడు ఆ కారణాలన్నీ సమసిపోయా యనుకో. ఇప్పుడు నేను వివాహం చేసుకోవాలంటే కొన్ని క్లిష్టమయిన సమస్యల్ని ఎదుర్కోవాలి. ఇంతకీ దైవం వ్రాసిన వ్రాత మనం తప్పించలేం. నీ బ్రతుకు చూడు ఎలాగైపోయిందో'' అన్నాడు సుబ్బరాజు.

''చెప్పక చెప్పక నా బ్రతుకే చెప్పాలి. అంతా అయిపోయింది. ఇక చావుకోసం నిరీక్షించడమే నాకు మిగిలింది'' అన్నది జగదాంబ కళ్లు తుడుచుకొంటూ.

''ఛీ, అటువంటి మాటలు అడకు. నువ్వేమీ కాటికి కాళ్లు జాచిన వృద్ధురాలివి కాదు. నిన్న గాక మొన్నటి పిల్లవి'' అన్నాడు సుబ్బరాజు.

''నాకు ముప్పై అయిదు ఏళ్లు.''

''అయితే మాత్రం? పాతికేళ్ల మనిషిలా ఉన్నావు. ఎంత అందంగా ఉండే దానివి! నీకు పెళ్లయిన కొత్తలో నువ్వు పుట్టింటికి వచ్చినప్పుడు చూసేవాడిని. నిజంగా లక్ష్మీదేవిలా కనిపించేదానివి. నీకు ఈ గతి ఎలా పట్టిందో నాకు అర్థం కావడంలేదు'' అన్నాడు సుబ్బరాజు.

జగదాంబ ముఖంమీద గుడ్డ వేసుకొని ఏడుస్తోంది.

''మొదట అనుకొన్నట్లు వివాహాలు జరిగివుంటే ఈ అవస్థలు లేకపోను'' అన్నాడు సుబ్బరాజు.

''ఘటన లేనప్పుడు ఎవరేం చెయ్యగలరు ? నేనంత అదృష్టవంతురాలిని కాదు'' అన్నది జగదాంబ.

సుబ్బరాజు ఏదో అనబోయాడు. కాని మాట బయటికి రాలేదు. పెదిమెలు వణికాయి. వెంటనే కాళ్లు చేతులు చల్లబడ్డాయి. ఇది తరుణం కాదు. అనుకొన్నాడు.

చూస్తున్న జగదాంబకి నిరాశ కలిగింది.

''ఏం సుబ్బరాజు, ఏమిటి విశేషం'' అంటూ ఇంతలో రామయ్యగారు లోపలి నుండి వచ్చారు.

* * *

రాజేశ్వరరావు స్వర్ణతో ఏకాంతంగా మాట్లాడడానికి మళ్లీ ఒక వారం రోజులు పోయాక అవకాశం దొరికింది. ఆరోజు హేమలత ఇంటివద్ద లేదు మాస్టారి పిలుపు వినగానే స్వర్ణ చావిట్లోకి వచ్చింది. పార్వతమ్మ వంటింట్లోను జగదాంబ మేడమీద తన గదిలోను ఉన్నారు.

స్వర్ణ వస్తూనే రేడియో ట్యూను చేసింది. వాల్యూము కాస్త ఎక్కువగానే పెట్టింది. దాని గోలలో తమ మాటలు ఎవరికీ వినిపించకుండా ఇద్దరు గుసగుసలు మాట్లాడుకొంటున్నారు.

జగదాంబ తలలో ఆలోచనలు సుడిగుండంలా తిరుగుతున్నై. మొన్న తనకి సుబ్బరాజుకి జరిగిన సంభాషణ సుదీర్ఘమయినది. కాని ఫలితం మాత్రం శూన్యం. సుబ్బరాజు అభిప్రాయం ఎలా ఉన్నదో ఆమెకు తెలియలేదు. తన అందాన్ని మెచ్చుకొన్నాడు. తన దుస్థితికి విచారించాడు. చిన్ననాటి రోజులు జ్ఞప్తికి తెచ్చాడు. ఇవన్నీ ఆశాజనకంగానే ఉన్నై. కాని అంతటితో అతడు చాలించాడు. అతడికి తనని వివాహం చేసుకోవాలనే ఉద్దేశం ఉన్నట్టు ఏమాత్రం బయటపడలేదు. తనే అనవసరంగా ఏదో భ్రమలో పడిపోతోంది. ఈ వయస్సులో ఈవూరి వాతావరణంలో తను ఇంకొక వివాహం ఆశించడం తెలివి తక్కువ. అంతకంటే తన బావగారి కొడుక్కి స్వర్ణ నిచ్చి పెళ్లిచేస్తే తనకి చాలా లాభదాయకం. వాళ్ళు తనని తప్పక చేరదీస్తారు. జీవితాంతం వాళ్ల వద్దనే గడపవచ్చును.

విమానం ఎగురుతున్నట్లు దగ్గరగా చప్పుడు వినిపించడంతో జగదాంబ ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఆమె వెంటనే డాబామీదకి వెళ్లింది. ఆకాశం కనిపించలేదు. శబ్దం మాత్రం వస్తూనే ఉన్నది. ఏదైనా కారు వచ్చిందా అనుకొన్నది. రోడ్డువైపు చూసింది. అక్కడా ఏదీ కనిపించలేదు. అప్పుడు ఆమె గ్రహించింది—అది శ్రుతి తప్పిన రేడియోలో నుండి వస్తున్న ధ్వని అని.

''రేడియో వేసేసి ఎవరి దారిని వాళ్ళు పోతారు. అది ఎలా తగలబడినా ఎవరూ పట్టించుకోరు. నెలకి ఒక బ్యాటరీ అయిపోతోంది'' అని విసుక్కొంటూ జగదాంబ మేడ దిగి చావిట్లోకి వచ్చింది.

ఎదురైన దృశ్యంతో ఆమె నిర్ఘాంతపోయింది.

''స్వర్ణా'' అని గట్టిగా అరిచింది.

స్వర్ణ, రాజేశ్వరరావు తుళ్లిపడ్డారు. మెరుపులాగా దూరంగా జరిగిపోయారు. తెల్లమొహాలు వేసి చూస్తున్నారు.

''ముందు రేడియో ఆపుచెయ్యి'' అని జగదాంబ కేక వేసింది.

స్వర్ణభయంగాలేస్తూ రేడియో ఆపుచేసింది.

''నీకు సిగ్గు, లజ్జ లేదూ ? ఈడు వచ్చిన పిల్లవి. త్వరలోనే పెళ్లి కాబోతున్నది. ఆమాత్రం జ్ఞానం ఉండొద్దూ?'' అన్నది జగదాంబ.

''అది కాదండీ—'' అని ఏదో చెప్పబోయాడు రాజేశ్వరం.

''నువ్వు నోర్ముయ్'' అన్నది జగదాంబ.

''కాదత్తయ్యా, నేను వీరినే పెళ్లిచేసుకొంటాను'' అన్నది స్వర్ణ తెగించి.

''ఏమిటీ ? నానాపాట్లు పడి నీకోసం లక్షణమైన సంబంధం మేం స్థిరపరుస్తుంటే ఈ బడిపంతుల్ని పెళ్లిచేసుకొంటానని అంత ధైర్యంగా చెప్తావా? ముందు ఇంట్లోకి నడు'' అన్నది జగదాంబ.

స్వర్ణ నడిచింది.

''నేను స్వర్ణ ఒకరి నొకరం మనసారా ప్రేమించుకొన్నామండి. ఇద్దరం వివాహం చేసుకోడానికి నిశ్చయించాం.'' అన్నాడు రాజేశ్వరరావు.

''హోయబ్బో ప్రేమట! నీకు ప్రేమ కావాలంటే సినీమాలకి వెళ్లి చూడు. అంతేగాని మర్యాదస్తుల ఇంట్లో జొరబడి ఆడపిల్లల మనస్సులు పాడు చెయ్యకు. ముందు బయటికి నడు''

"లేదండి. నాకేమీ దుర్బుద్ధి లేదు. రామయ్యగారి నడిగి స్వర్ణని వివాహం చేసుకోవాలని నా ఉద్దేశం" అన్నాడు రాజేశ్వరరావు.

"తాహతుకి మించి మాట్లాడకు. నీకు పెళ్లి కావాలంటే నీ అంతస్థుకి తగిన సంబంధం చూసుకొని పెళ్లి చేసుకో. అంతేకాని మధ్యన మా ఇంటిమీద పడతావేం ? అసలు నువ్వెవడివి? నీకు మాకు ఏమిటి చుట్టరికం? మర్యాదగా బయటికి నడుస్తావా, లేదా?" అని స్వరం రెట్టించి జగదాంబ అడిగింది.

"నన్ను పొమ్మనడానికి నువ్వెవరు? ఇక్కడ నీకు ఉన్న అధికారం ఏమిటి? బోడి పెత్తనం. అయినా నీ కేకలు విని నలుగురు పోగైతే నాకే చిన్నతనం" అంటూ వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు రాజేశ్వరం.

అరుగుమీద వరకు అతడి వెనక జగదాంబ వెళ్లింది. అతడు వెళ్లిపోతుంటే దుర్భాషలు ఆడుతూనే ఉన్నది. ఆమె కేకలు విని పార్వతమ్మ వంటింట్లో నుండి వచ్చింది. ఎక్కడికో వెళ్లిన రామయ్యగారు కూడా అదే సమయానికి తిరిగి వచ్చారు.

"ఏమిటే గొడవ ?" అని జగదాంబని ప్రశ్నించారు. జగదాంబ జరిగినదంతా చెప్పింది.

"ఆమాత్రం దానికి అతడిని కాస్త మందలించాలి గాని నోటికి వచ్చినట్లు తిట్టవచ్చునా?" అన్నారు రామయ్యగారు.

"అతడికే స్వర్ణ నిచ్చి వివాహం చేస్తే బాగుంటుందని మేము అనుకొంటున్నాం వదినా" అన్నది పార్వతమ్మ.

"ఏమిటీ?—" అంటూ తాచుపాములా లేచింది జగదాంబ—"మీకు మతి పోయిందా ? 'రాముడు రావణుని చంపెను' అని పొద్దుటినుండి సాయంత్రం వరకు కేకలు వేస్తేగాని దినం వెళ్లని బడి పంతులుకి స్వర్ణ నిస్తారా? మీ ఇద్దరికి బొత్తిగా యుక్తాయుక్త విచక్షణ పోయింది. మా బావగారి అబ్బాయి కాలి గోటికైనా ఇతడు సరిపోతాడా ? అతడు ఇవాళో రేపో రానే వస్తాడు. ఇటువంటి అవకతవక ఆలోచనలు పెట్టుకోవద్దు. ఆ రాజేశ్వరం నన్ను నోటికి వచ్చిన మాటలన్నీ అన్నాడు. 'నువ్వెవరు చెప్పడానికి ?' అని కూడా అన్నాడు. కాబట్టి రేపటినుండి మన గుమ్మం తొక్కవద్దని వెంటనే నువ్వే అతడికి కబురు పంపించు" అన్నది అన్నతో.

రామయ్యగారు ఆమెకు ఎదురు చెప్ప లేక పోయారు. అన్ని విషయాలలోలాగే ఇందులో కూడా ఆమె చెప్పినట్లే చేశారు.


రాజేశ్వరరావు తిన్నగా తన గదికి వెళ్లిపోయాడు. ఒకవైపు కోపం, ఒకవైపు విచారం అతడిని ఆవరించాయి. ఇది కేవలం అన్యాయం అనుకొన్నాడు. ప్రేమకి అంతస్తులేమిటి? అనుకొన్నాడు. ఇంతకీ తమ వివాహానికి రామయ్యగారు పార్వతమ్మ సుముఖంగానే ఉన్నారని, నిరుత్సాహపడవలసిన అవసరంలేదని ఇందాక స్వర్ణ చెప్పింది. మధ్య ఈ జగదాంబ ఎవరు ? ఆమెకి ఆ యింట్లో కొంత అధికారం ఉన్నమాట నిజమే. కాని తను కొమార్తె వివాహ విషయంలో కూడా జగదాంబ చెప్పిన ప్రకారమే రామయ్యగారు చేస్తారా ? అంత పూర్తిగా తన వ్యక్తిత్వం, తన అధికారం ఆయన కోల్పోయి ఉండరు. రామయ్యగారు ఒంటరిగా ఉన్నప్పుడు ఒకసారి తను వారితో ముఖాముఖీగా మాట్లాడితే ప్రయోజనం ఉండవచ్చును. ఆయన ఒప్పుకొంటారనే రాజేశ్వరరావుకి ధైర్యం కలిగింది. తనకి ఆస్తిపాస్తులు లేకపోవచ్చును. కాని బాగా చదువుకొన్నాడు. ఎప్పటికైనా తనని హైస్కూలుకి మార్చి వేస్తారు. అప్పుడు కావలసినంత జీతం వస్తుంది. ఇక తన గుణగణాదుల గురించి రామయ్యగారు ఈపాటికి కొంత తెలుసుకొనే ఉంటారు.

కాని అతడి ఆశాసౌధం వెంటనే కూలిపోయింది. రామయ్యగారి పాలేరు వచ్చి "రేపటినుండి ప్రయివేటు చెప్పడానికి రావద్దని రామయ్యగారు తమతో చెప్పమన్నారు" అని చెప్పాడు.

రాజేశ్వరరావు నిరాశావాది కాడు. ఇక మీదట చెయ్యవలసిన దేమిటి ? అని ఆలోచించాడు. స్వర్ణని తను వదులుకోవడమా అన్న ప్రశ్న లేనేలేదు. ఆమె లేనిదే తను బ్రతకలేడు. స్వర్ణ, తను ఒకరి కోసం ఒకర్ని భగవంతుడు నిర్ణయించాడని అతడు పూర్తిగా నమ్మాడు. అయితే ఈ వివాహం జరగడం ఎలాగ ? ఆలోచించగా అతడికి చివరికి ఒక ఉపాయం తోచింది. దీనికి రుక్మిణీ కల్యాణమే సరియైన పథకం అన్య మార్గాంతరంలేదు అనీ. కాని స్వర్ణ ఒప్పుకుంటుందా ? ఆమె రుక్మిణి వంటిది కాదు. బొత్తిగా పల్లెటూరిపిల్ల. అయినా ప్రయత్నించాలి మరి. ఎలాగైనా ఒప్పించాలి.

స్వర్ణని తిరిగి కలుసుకోవడం ఎలాగ ? అన్నది రెండవ ప్రశ్న. దానికి కూడా అతడికి సమాధానం దొరికింది.

(41 వ పేజీ చూడండి)



రామయ్యగారి ఇంటిని ఆనుకొని వాళ్ళదే ఒక తోట ఉన్నది. స్వర్ణ అప్పుడప్పుడు సాయంకాలం వేళలో ఒంటరిగా తోటలోకి వస్తూంటుంది. ఒకటి, రెండు రోజులు తను కనిపెట్టాడంటే అవకాశం లభించక పోదు అనుకొన్నాడు.

అతడికి అట్టి అవకాశం కొద్ది రోజుల లోనే కలిగింది.

* * *

చెరకు అమ్మిన సొమ్ము సుబ్బరాజు చేతి వచ్చింది. చెరకు బాగా పండడం, ధర బాగా పెరగడం నుండి అతడికి చాలా సొమ్ము ముట్టింది. దీనితో రామయ్యగారి బాకీ తీర్చివెయ్యాలని సుబ్బరాజు ఒకరోజు సాయంత్రం తిరిగి రామయ్యగారింటికి వెళ్ళాడు. జగదాంబ హాల్లోనే ప్రత్యక్ష మయింది.

"రామయ్య లేడా ?" అంటూ అతడు లోనికి ప్రవేశించాడు.

"ఎక్కడికో వెళ్ళాడు. వచ్చే వేళ అయింది. కూర్చోండి" అన్నది జగదాంబ.

"ఇంట్లో ఎవరూ సందడి లేదేం ?" అన్నాడు సుబ్బరాజు కూర్చొంటూ.

"వదిన యథాప్రకారం వంటింట్లో ఉన్నది. స్వర్ణ మేడమీద ఉన్నది" అన్నది జగదాంబ.

జగదాంబతో ఏకాంతంగా ప్రసంగించ డానికి ఇదే అనువైన సమయం అను కొన్నాడు సుబ్బరాజు. ఒకవైపు నుండి భయం అతడిని వెనక్కి లాగుతున్నది. "ధైర్యంగా అడిగెయ్. అంతగా ఆమె గోల చేస్తే అంతకంటే నువ్వే ఎక్కువ గోల చెయ్యవచ్చును. వెంటనే అప్పు తీర్చమని రామయ్య నిర్బంధిస్తే నైకం జేబులో సిద్ధంగానే ఉన్నది" అంటూ అంతరాత్మ ఒకవైపు నుండి అతడిని ముందుకి తోస్తు న్నది.

సుబ్బరాజు ఏవిధంగా సంభాషణకి ఉపక్రమిస్తాడో అని జగదాంబ ఆతృతతో ఎదురుచూస్తున్నది. తన కలలన్నీ పగటి కలలేనా ? తన వూహాలన్నీ గాలిలో మేడ లేనా ? లేక తనకి ఇంకా మంచిరోజులు వచ్చే అదృష్టం ఉన్నదా ? ఇదే తెలియు

## బ్రహ్మముడి

(19వ పేజీ తరువాయి)

వలసిన సమయం. ఇటువంటి అవకాశం ఇంకొకసారి కలగడం కష్టం అను కొన్నది. సుబ్బరాజు గుడ్లు అప్పజెప్పి చూస్తున్నాడే కాని అతడి నోటంట మాట బయటికి రావడంలేదు.

స్వర్ణ మేడ దిగి వచ్చింది. ఈమధ్య జగ దాంబ ఎప్పుడూ తనవైపు ఒక కన్ను వేసే ఉంచింది. తను ఎక్కడికి వెళ్ళినా, ఎవరితో మాట్లాడినా గమనిస్తూనే ఉన్నది. రాజేశ్వరరావు ఒకటి రెండుసార్లు తోటలోకి రావడం స్వర్ణ మేడమీద నుండి చూచింది. కాని జగదాంబ కాపలా నుండి ఆమె తోటలోకి ఒంటరిగా వెళ్ళ లేకపోయింది. ఇప్పుడు చావిట్లో సన్నివేశాన్ని స్వర్ణ చూచింది. తన తండ్రి తిరిగి వచ్చే వరకు జగదాంబ సుబ్బరాజుతో మాట్లా డుతూ కూర్చొంటుంది. తనకి ఇదే మంచి తరుణం. ఈరోజు రాజేశ్వరరావు వస్తే ఎంత బాగుండును అనుకొంటూ తోట లోకి దారితీసింది.

* * *

"ఏమిటి అలా చూస్తున్నారు?" అని చివరికి జగదాంబ ప్రశ్నించింది.

"ఆ—ఏమీలేదు. మన ఇద్దరి బ్రతు కులు ఇలా—ఇలా—వ్యర్థం కావలసిందేనా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు సుబ్బరాజు.


"భగవంతుడు ఎలా నిర్ణయిస్తే అలా జరగక తప్పదు" అన్నది జగదాంబ. అతడి ధోరణి ఆమెకి బాగా నచ్చింది. తన ఆశ ఫలిస్తుందేమో అనుకొన్నది. ఉత్సాహంతో అతడివైపు చూస్తున్నది.

"అది కాదు. మనం—మనం ఇద్దరం"

"ఏమిటి మన మిద్దరం?" అన్నది జగ దాంబ సన్నని గొంతుకతో. ఆ మధుర క్షణం సమీపించబోతున్నది అనుకొన్నది. లేచి అతడికి కాస్త దగ్గరగా వచ్చింది.

కాని సుబ్బరాజుకి ఆ వాక్యం పూర్తి చేసే ధైర్యం లేకపోయింది. ఆమె తనని సమీపిస్తూంటే అతడికి ఒళ్ళు తెలియని భయం పట్టుకొన్నది. ముచ్చెమటలు పోసినై. నాలిక పిడచకట్టింది.

"మంచినీళ్ళు—మంచి మంచినీళ్ళు కావాలి" అన్నాడు అతడు బొంగురుపోయిన గొంతుకలో.



# బ్రహ్మముడి

జగదాంబ ఒక్క అడుగుతో ఇంట్లోకి వెళ్లింది. గ్లాసుతో నీరు తెచ్చింది.

"పుచ్చుకోండి" అంటూ సుబ్బరాజు చేతికి అందించింది. ఆమె చేతులు వణుకుతున్నాయి.

కాని సుబ్బరాజు చేతులు అంతకంటే వణుకుతున్నాయి. ఇద్దరి వణుకు చేతుల మధ్య గ్లాసు జారిపోయింది. అనుకోకుండా సుబ్బరాజుకి కొంత స్నానం అయింది.

"గ్లాసు వదిలేశావేం ?" అన్నాడు సుబ్బరాజు.

"మీరు పట్టుకోకుండా వదిలేస్తే నేనేం చేసేది?" అన్నది జగదాంబ.

"నేను పట్టుకోకుండా నువ్వు వదిలేస్తే నేనేం చేసేది ?" అన్నాడు సుబ్బరాజు. అసలు విషయం విడిచి ప్రసంగము ఈవిధంగా మారినందుకు అతడికి కొంత హాయి కల్గింది.

"పోనీ ఇంకొక గ్లాసు తెస్తానుండండి" అంటూ జగదాంబ లోనికి వెళ్లింది.

ఆమె తిరిగి వచ్చేసరికి రామయ్యగారు చావిట్లో ప్రవేశిస్తున్నారు.

ఛీ, ఛీ, ఏం బ్రతుకు" అనుకొన్నది జగదాంబ. ఈ తరుణం ఇలా వెడిపోయింది. ఇక తనకు నిరాశే మిగిలింది. ఈ క్షణం లోనే అన్నయ్య తిరిగి రావాలా ? అయినా సుబ్బరాజు ఏం మనిషి? మగవాడికి మరీ అంత భయమైతే ఎలాగ? తను అనవలసిన ఆ రెండు మాటలు గూడా అతడు పూర్తిచేస్తే ఎంత బాగుండేది? మళ్లా ఇటువంటి అవకాశం దొరకదు. దొరికినా సుబ్బరాజు ఈలోగా తన అభిప్రాయం మార్చుకోవచ్చును. తనకి ఇక విముక్తి లేదు. చనిపోయేవరకు పరాధీనం బ్రతుకు తప్పదు. విధి తనని మోసగించింది. ఆమెకు విధి పైన అందరిపైన ఎక్కడలేని కోపం వచ్చింది. అదే సమయంలో పార్వతమ్మ వంటింట్లోంచి వచ్చి "స్వర్ణా, స్వర్ణా" అని మేడవైపు పిలుస్తున్నది. కాని స్వర్ణ పలకలేదు. స్వర్ణ మేడమీద లేదన్న సంగతి తెలియగానే ఆమె ఒంటరిగా ఎక్కడికి వెళ్లిందా? అని జగదాంబకి అనుమానం కలిగింది.



"ఓరి నీ ఇల్లు బంగారం కానూ!..."

"ఎందుకలా వూర్కే ఆశపెడ్తావ్ ??"

*　　*　　*

స్వర్ణ తోటలో కూర్చొని పుస్తకం చదువుతోంది. ఆమె కళ్లు క్షణక్షణానికి రాజేశ్వరరావు రాకని అన్వేషిస్తున్నాయి. ఎండవేడిమి తగ్గి కాస్త చల్లనిగాలి అప్పుడే ప్రారంభించింది. నడివయస్సు పక్షులు ఒక్కొక్కటి గూళ్ళు చేరుకుంటున్నాయి. మామిడి చిగుళ్లపైన అరుణకాంతులు పడి తోటంతా ఎర్రగా ఉన్నది.

స్వర్ణ ఆశించినట్లే రాజేశ్వరరావు వచ్చాడు. "నీతో మాట్లాడాలని ఎన్ని రోజుల నుండి ప్రయత్నిస్తున్నానో తెలుసా? చివరికి ఈరోజు దర్శనం లభించింది." అంటూ ఆమె పక్కన కూర్చొన్నాడు.

"మీరు రావడం నేను గమనిస్తూనే ఉన్నాను. కాని మా అత్తయ్య నన్ను తోకలా వెంటాడుతూనే ఉన్నది. ఇప్పుడెలాగో అవకాశం దొరికింది. కాని ఆమె ఏక్షణానైనా ఇక్కడికి వస్తుంది. మళ్లా మన ఇద్దరిని చూచిందంటే చాలా ప్రమాదం" అన్నది స్వర్ణ.

రాజేశ్వరరావుకి వెంటనే ఒక ఆలోచన తట్టింది. "మనం మాట్లాడవలసిన ముఖ్యమైన సంగతులు ఉన్నాయి. అందుచాత నేను ఆ పొదల చాటున కూర్చొంటాను. నువ్వు పుస్తకం పట్టుకొని చదువుతున్నట్టు నటించు. మీ అత్త సైటు కాగానే 'అప్పుడు కారుమబ్బుల తలము కొనెను' అని గట్టిగా చదువు. నేను వెంటనే అలా — అలా మాయమైపోతాను" అన్నాడు రాజేశ్వరరావు. స్వర్ణ సరే అన్నది.

రాజేశ్వరరావు పొదలచాటున కూర్చొన్నాడు. స్వర్ణ పుస్తకం పట్టుకొని అతడికి దగ్గరగా ఇటు అటు పచారు చేస్తున్నది.

"ఏమిటి విశేషాలు ? నేను వెళ్లాక ఏమైనా గొడవ జరిగిందా ?" అని అతడు అడిగాడు.

"పెద్దవాళ్ళు ఏదో మాట్లాడుకొన్నారు.

మా అమ్మ, నాన్నగారు నన్ను పెళ్లెత్తు మాట అనలేదు. జగదాంబ మాత్రం నన్ను ఇరవైనాలుగు గంటలు కనిపెట్టుకొనే తిరుగుతున్నది'' అన్నది స్వర్ణ పుస్తకంలోకి చూస్తూ.

''మళ్లా ఏదైనా ఉత్తరం వచ్చిందా ?'' అని పొదలోంచి ప్రశ్న వచ్చింది.

''వచ్చింది. రేపు అతడు వస్తున్నాడట'' అని పుస్తకంలో నుండి సమాధానం వెళ్లింది.

''రేపే ?'' అన్నది పొద.

''రేపే'' అన్నది పుస్తకం.

''ఇక లాభంలేదు స్వర్ణా. నేను ఒక నిశ్చయానికి వచ్చాను. మన వివాహం జరగాలంటే ఒక్కటే మార్గం కనిపిస్తోంది. ఈ రాత్రే మనం పలాయనం చిత్తగించాలి'' అన్నాడు రాజేశ్వర్రావు.

''అమ్మో, నేను రాను'' అన్నది స్వర్ణ.

''నేను చెప్పింది విను. మనం ఏ అన్నవరమో వెళ్లి అక్కడ దేవుని సాన్నిధ్యంలో పవిత్రంగా వివాహం చేసుకొందాం'' అన్నాడు రాజేశ్వర్రావు.

''ఏమో బాబు. అటువంటి పనులంటే నాకు భయం'' అన్నది స్వర్ణ. ఇంతలో ఆమెకు ఏదో కన్పించగానే ''అంతట కారుమబ్బులు అలముకొనెను'' అని బిగ్గరగా చదివింది.

జగదాంబ దగ్గరికి వచ్చింది. ''ఏమిటే చేస్తున్నావ్?'' అని ప్రశ్నించింది.

''ఇదిగో, పుస్తకం చదువుకొంటున్నాను అత్తయ్యా'' అన్నది స్వర్ణ.

''ఎవరితోనూ మాట్లాడడం లేదా?'' అన్నది జగదాంబ.

''ఇక్కడ ఎవరూ లేరే'' అన్నది స్వర్ణ అమాయకంగా.

జగదాంబ నాలుగు వైపులా చూచింది. ఆమెకు ఎవ్వరూ కనిపించలేదు. ''నేను ఒక మగ గొంతుక స్పష్టంగా విన్నాను'' అన్నది.

స్వర్ణ నవ్వింది. ''అదా ! పుస్తకంలో సంభాషణ నేనే రెండు గొంతుకలతో చదువుతున్నాను అత్తయ్యా'' అన్నది.

''ఏదో! ఇకమీదట నువ్వు ఒంటరిగా తోటలోకి రావద్దు'' అన్నది జగదాంబ.

''అలాగే అత్తయ్యా'' అంటూ ఆమె వెంట వెళ్లింది స్వర్ణ.

* * *

రాజేశ్వరరావు తిర్గిగి తన గది చేరుకొన్నాడు. వాడెవడో రేపే వస్తాడట. ఇది ఒక చిక్కు వచ్చిపడింది అనుకొన్నాడు తనలో. స్వర్ణకి తనపైనపూర్తిగా అనురాగం ఉన్నమాట నిజం. కాని ఆమె స్వతంత్రురాలు కాదు. రేపు వాడు వచ్చి చూచి నచ్చింది అన్నాడంటే ఇంట్లోవారందరు ఆమెపైన బ్రహ్మాండమైన ఒత్తిడి తెస్తారు. అప్పుడు స్వర్ణ ఒప్పుకోక తప్పదు. లేదా ఈ బలవంతపు పెళ్లికి యిష్టంలేక ఆమె ఆత్మహత్య తలపెట్టవచ్చును. తన ఉద్దేశం ఆమెతో ఇందాకట తోటలో కొంతవరకు చెప్పాడు. ఆమె మెత్తబడుతున్నది కూడా. ఈలోగా జగదాంబ వచ్చి వ్యవహారం పాడుచేసింది. ఇప్పుడు ఉపేక్షించదగిన సమయంకాదు. ఈ రాత్రే తను, స్వర్ణ ఎక్కడికైనా వెళ్లిపోవాలి. కాని ఈ రాత్రి ఆమెతో తిరిగి మాట్లాడడం ఎలాగ ? తీవ్రంగా ఆలోచించాడు రాజేశ్వరం. అన్ని వివరాలతో కనీసం ఒక ఉత్తరమైనా వెంటనే ఆమెకు అందజెయ్యాలి అనుకొన్నాడు. ఉత్తరంమాత్రం ఆమెకు అందడం ఎలాగ అన్నది ఒక పెద్ద సమస్య అయిపోయింది. చివరికి అతడికి ఒక మార్గం తోచింది.

స్వర్ణ గది ఏదో అతడికి తెలుసును. ఇదివరకు హేమలత అతడికి ఒకసారి వాళ్ల ఇల్లంతా చూపించింది. అది నాలుగు ఇళ్ల భవంతి. అందులో ఒకవైపు మేడ వేసి రెండు గదులు కట్టారు. మేడమీద ఎడమ చేతివైపు గది చూపించి 'ఇది స్వర్ణ గది' అని అప్పుడు హేమలత చెప్పింది. ఇప్పుడు తను ఉత్తరం వ్రాసి మళ్లా వాళ్ల తోటలో ప్రవేశించి ఉత్తరాన్ని సూటిగా కిటికీలోంచి ఆమె గదిలోకి విసిరేస్తే ఆమెకి తప్పకుండా అందుతుంది. దానితో ఆమె సమ్మతించవచ్చును. ఏదైనా ప్రయత్నం మనవంతు, ఫలితం భగవంతుని వంతు అనుకొన్నాడు.

కాగితం కలం తీసి ఉత్తరం వ్రాశాడు.


''ప్రియతమా,

ఈరోజు నీతో చెప్పబోయిన ఆ విషయము, దాని వివరాలు నీకు పూర్తిగా చెప్పకుండానే మన సంభాషణకి అంతరాయం వచ్చింది. నీ సమ్మతి నేను పొందలేదు. ఈ ఉత్తరం చదివాక నువ్వు సమ్మతిస్తావని నేను పూర్తిగా నమ్ముతున్నాను. ఈ రాత్రి మనం వెళ్లిపోవాలి. మనకి ఏమాత్రం వ్యవధిలేదు. కారణాలు నీకు తర్వాత చెప్తాను. మనం ఒకరికోసం ఒకరం నిర్దేశింపబడ్డాం. మధ్యలో ఎన్ని అవాంతరాలు వచ్చినా చివరికి మనం ఒక్కటే కాబోతున్నాము. కాబట్టి ఇప్పుడు నేను చెప్పబోయే ప్రణాళిక నువ్వు తప్పకుండా అమలు జరపాలి. ఈ రాత్రి పన్నెండు గంటలు కొట్టగానే మీ పెరటి తలుపు తీసుకొని నువ్వు రావాలి. నేను గోపన్న బండి తీసుకువచ్చి సిద్ధంగా ఉంచుతాను. ఒంటిగంటకి వచ్చే రైలులో మన ప్రయాణము. రేపు అన్నవరంలో వివాహం చేసుకొంటాం నువ్వు దేనికి భయపడవద్దు. లోకానికి వెరవవద్దు. మన ఆశయం పవిత్రమైనది. నువ్వు ఏ కారణంవల్లనైనా రాకపోతే నా శేష జీవితమంతా చీకటి అవుతుంది.

ఇట్లు,
నీ రాజు.''

ఉత్తరం ఒకసారి చదివాడు. బాగానే కుదిరింది అనుకొన్నాడు. తిరిగి రామయ్యగారి తోటలో ప్రవేశించాడు. మేడమీద కిటికీలలో నుండి వెలుతురు కనిపిస్తోంది. ఉత్తరానికి ఒక రాయి కట్టి బలంకొద్దీ ఎడమచేతివైపు కిటికీలోకి విసిరివేశాడు. అక్కడనుండి తిన్నగా గోపన్న వద్దకు వెళ్లాడు. తన బండి కట్టడానికి గోపన్న మొదట నిరాకరించాడు. కాని రాజేశ్వర్రావు రెట్టింపు అద్దె ఇస్తానని ఆశ కలిగించడంతో అతడు మెత్తబడ్డాడు.

(ఇంకావుంది)



# బ్రహ్మముడి

న్యాయపతి రాజగోపాలం

(గత సంచిక తరువాయి)

రాత్రి పన్నెండు గంట లయింది. అసలే చీకటిరాత్రులు. అందులో మేఘాలు దట్టముగా అలముకొని ఉన్నై. బ్రహ్మాండమైన చీకటిగా ఉన్నది. రాజేశ్వరరావు రామయ్యగారి పెరటి గుమ్మం వద్ద చేరాడు. అప్పటికే గోపన్న బండి సిద్ధంగా ఉన్నది. స్వర్ణ వస్తుందో, లేక తన ప్రయత్నమంతా వ్యర్థమవుతుందో అని ఎంతో ఆతృతతో రాజేశ్వరరావు ఎదురుచూస్తున్నాడు. అయిదు నిముషాలు గడిచాయి. కాని అతడికి ఒక గంట గడిచినట్లయింది. అప్పుడే ఒకవైపు నుండి నిరాశ అతడిని ఆవరిస్తోంది. 'ఇంతలో లోపలినుండి గడియ తీస్తున్న శబ్దం వినిపించింది. ఆ తరువాత తలుపు తెరుచుకున్న శబ్దం, దానితో గుమ్మని పూర్ణవాసన. ఉత్తర క్షణంలో అతడి జేబుకి ఏదో గట్టిగా తగిలింది. రాజేశ్వరరావు త్రుళ్లిపడ్డాడు. కాని, అది మాటు కేసు అని, దానిని ఆమె తనకి అందిస్తోందని గ్రహించాడు. వెంటనే ఆమె చేతిలో నుండి దానిని తీసుకొన్నాడు. వెళ్లి బండిలో పెట్టాడు. ఆమె కూడా అతడి వెనక వచ్చింది.

జయం మనదే అని ఒక్కసారి గట్టిగా కేకవెయ్యా లనిపించింది రాజేశ్వరానికి. ఆమెను తన బాహువుల్లోకి తీసుకోవాలని ఎంతో ఉబలాట పడ్డాడు. కాని ఇది చాలా ప్రమాదకరమైన సమయం. పైగా టైము అయిపోతోంది.

ఆమె బండిలో కూర్చొన్నది. రాజేశ్వరరావు గోపన్న వద్దకు వెళ్లి "గోపన్నా, నేను బండి వెంట రావడం అంత క్షేమంకాదు. అడ్డుదారిని వచ్చి స్టేషనుకు ముందుగా కలుసుకొంటాము." అని అతడి చెవిలో చెప్పాడు.

బండి కదిలింది. రాజేశ్వరరావు అడ్డుదారి పట్టేడు.

స్టేషను ఇంకొక ఫర్లాంగు ఉన్నదనగా ఈ అడ్డుదారి రోడ్డుకి కలుస్తుంది. అతడు అక్కడివరకు త్వరగా వెళ్లాడు. గోపన్న బండి వచ్చేవరకు అక్కడ నిలబడ్డాడు. అక్కడినుండి బండివెంట నడక ప్రారంభించాడు.

ఇంతలో దూరం నుండి రైలు చప్పుడు వినిపించింది. అప్పుడే పాసింజరు వచ్చే సో — అని అతడు కంగారు పడ్డాడు. కాని, స్టేషను దగ్గర పడినా ఆ రైలు వేగం తగ్గలేదు. పైగా ప్లాటుఫారం రెండవ చివర అతడికి ఆకుపచ్చ దీపాలు కనిపిస్తున్నై. హోహో, ఇది ఎక్స్‌ప్రెస్ అయివుంటుం దనుకొన్నాడు.

స్టేషను ఇంకో వంద గజాలు ఉన్నా దనగా రోడ్డు ఒక మలుపు తిరిగి పటా

పక్క నుండి వెళ్తుంది. గోపన్న బండి మలుపు తిరగేసరికి ఎక్స్‌ప్రెస్ ముఖం మీది సెర్చిలైట్ బండిలో పడి లోపలి అంధకారాన్ని ఒక్కసారి తరిమివేసింది. రాజేశ్వరరావు బండిలోకి చూశాడు.

బండిలో స్వర్ణ లేదు. జగదాంబ కూర్చొని ఉన్నది.

రాజేశ్వరరావు అదిరిపడ్డాడు. "ఈ పిశాచము ప్రవేశించిం దేమిటి ?" అనుకొన్నాడు. అతణ్ణి ఒక్కసారిగా నిరుత్సాహం, కోపం ముంచెత్తివేశాయి.

కాని అతడు ఏమాత్రం బయటపడలేదు. మనస్సుని నిగ్రహించుకొన్నాడు. ఇక మీదట జరగబోయే సంభాషణ మూడో వ్యక్తి ఎవరూ వినకూడదని అతడికి స్ఫురించింది. వెంటనే "గోపన్నా, ఎక్స్‌ప్రెస్ ఇంకా ఇప్పుడు వెళ్తోంది. మన ప్యాసింజరు బాగా లేటు అయ్యేటట్లు ఉన్నది. నీ బండి ఇక్కడ నిలబెట్టి ఒక్కసారి స్టేషనుకి వెళ్ళిరా. ఎంత లేటో కనుక్కో. ఇదిగో పది పైసలు. ఆచేత్తో కాస్త టీ కూడా తాగు," అని గోపన్నని పంపివేశాడు. గోపన్న కాస్త దూరం కాగానే,

"వారు రాలేదా" అని జగదాంబ ప్రశ్నించింది.

"వా రెవరు ? ఎవరు వారు ?" అన్నాడు రాజేశ్వరరావు ఒళ్ళు మండిపోతూ.

"సుబ్బరాజుగారు."

"సుబ్బరాజుగారు వస్తామన్నారా ?"

"అవును. గోపన్న బండి తీసుకొని వస్తా మని కూడా వ్రాశారు."

"అంటే ? ఉత్తరం వ్రాశారా ?"

"అవును."

"హోహో, రాత్రి పెరటి ద్వారం తెరుచుకొని మిమ్మల్ని రమ్మని, ఒంటి గంట ప్యాసింజరుకి ప్రయాణమని, ఏ కారణం వల్ల మీరు రాలేకపోయినా నాది శేష జీవితం చీకటి అవుతుందని కూడా వ్రాశారా ?"

"అవును. అన్నీ తెలిసి కూడా మీరు రాలేదా అంటే ఎవరు రావాలి అని అడుగుతా రేం ?" అన్నది జగదాంబ కోపంగా.

రాజేశ్వరరావు రోడ్డుమీద కూల బడ్డాడు. "రండి, బండి దిగండి. కొంప మునిగింది" అన్నాడు.

జగదాంబ బండి దిగి వచ్చింది.

"కూర్చోండి" అన్నాడు రాజేశ్వరరావు. జగదాంబ కూడా రోడ్డుమీద చతికిల పడ్డది.

"ఆ ఉత్తరం నేను వ్రాశాను" అన్నాడు.

"ఏమిటీ ? నువ్వు మనిషివా పశువ్వా ? నీ వయస్సేమిటి, నా వయస్సేమిటి ? నువ్వు నాకు అలా వ్రాయవచ్చా ? నామీద నీకు కోపం ఉన్నమాట నిజమే. కాని నా పరువు తీసి నన్ను నడివీధిలో నిలబెట్టడానికే పూనుకొన్నావా ? నీకు తల్లి లేదా, అక్కచెల్లెళ్ళు లేరా ?" అన్నది జగదాంబ గొంతెత్తి.

"ష్. గోల చేయకండి. నేను కలలో కూడా మీకు అటువంటి ఉత్తరం వ్రాస్తానా? దానిని నేను స్వర్ణకి వ్రాశాను" అన్నాడు రాజేశ్వరం.

"స్వర్ణకా ? ఓహో, అదా నీ ప్రయత్నము అయితే దానిమీద రాజు అని ఎందుకు సంతకం చేశావ్ ?"

"నాపేరు అదే."

"పోనీ అలాగే అనుకో. ఆ ఉత్తరాన్ని ఈ గదిలోకి ఎందుకు విసిరావ్ ?"

"మీ గదిలో ఎలా పడుతుంది? తోటలోంచి మేడమీది ఎడంచేతివైపు కిటికీలోకి విసిరాను."

"అదే నా గది అని చెప్తున్నాను."

రాజేశ్వరరావుకి అంతా అయోమయంగా ఉన్నది. "ఈమధ్య మీరు స్వర్ణ గదులు మార్చుకొన్నారా?" అని అడిగాడు.

"లేదు."

ఇది ఎలా తటస్థపడ్డదా అని రాజేశ్వరరావు తీవ్రంగా ఆలోచించాడు. కొంతకాలం ఆలోచిస్తే జరిగిన పొరపాటు అతడు గుర్తించగలిగాడు. ఇదివరకు తను రామయ్యగారి ఇల్లు చూసినప్పుడు నాలుగిళ్ళ వాకిట్లోంచి మెట్లెక్కి మేడమీదకి వెళ్ళాడని అప్పుడు ఎడంచేతివైపు గది చూపించి ఇది స్వర్ణ గది అని హేమ చెప్పింది. కాని ఇప్పుడు తను తోటలో నుండి ఉత్తరం విసరాడు. అంటే ఇదివరకు తను గది చూసిన వైపుకి అభిముఖంగా నిలబడ్డాడు. అంటే కుడిచేతివైపు కిటికీ స్వర్ణ గది అవుతుంది. ఎంత పొరపాటు జరిగింది!

"అవును. నా కిప్పుడు అంతా అర్థమౌతుంది. నా పొరపాటు ఏమిటంటే—" అని జగదాంబకి అంతా చెప్పాడు రాజేశ్వరరావు.

దూరాన్నుండి ఒక గూడ్సు మందగమనంతో గజగజలాడుతూ వస్తున్నది. దాని దీపపు కాంతి వా రిద్దరిపైన మసకగా పడుతోంది.

"అయితే నే నిప్పుడు ఏం చెయ్యడం? నేను తిరిగి మా అన్నయ్యగా రింటికి వెళ్ళ లేను. నేను వచ్చేటప్పుడు మా అన్నయ్య పేర ఒక ఉత్తరం కూడా వ్రాసిపెట్టి వచ్చాను. వాళ్ళెవరైనా లేస్తే ఈపాటికి దాన్ని చూసే ఉంటారు. ఇక నాకు గత్యంతరంలేదు. ఆ వస్తున్న రైలుక్రింద పడి ఇంతటితో ఈ జీవితంనుండి విముక్తి పొందుతాను" అని ఏడుస్తూ జగదాంబ పట్టాలవైపు వెళ్తోంది.

రాజేశ్వరరావు హడలిపోయాడు. 'ఆగండి' అని గట్టిగా ఒక కేక వేశాడు—ఆమె నిలబడ్డది—"దీనికి ఏదో ఉపాయం మనకు తప్పకుండా దొరుకుతుంది. మీరు ఆవేశపడకుండా కూర్చోండి. నేను ఆలోచిస్తాను" అన్నాడు.

జగదాంబ తిరిగి వచ్చి కూర్చొంది. రాజేశ్వరరావు మౌనంగా కొన్ని నిముషాలు ఆలోచించాడు.

"సుబ్బరాజుకి మీమీద నిజంగానే అనురాగం ఉన్నదా ?" అని ప్రశ్నించాడు చివరికి.

"ఉన్నదనే అనుకొంటున్నాను. లేకపోతే ఆయన ఉత్తరం వ్రాస్తారని నేను ఎలా భావిస్తాను?" అన్నది జగదాంబ కళ్ళు తుడుచుకొంటూ.

"అయితే పదండి ఆయన వద్దకు మిమ్మల్ని తీసుకు వెళ్తాను" అన్నాడు రాజేశ్వరరావు.

"ఛీ, ఛీ. నేను ఆడదాన్ని. ఆయన వద్దకు వెళ్ళి ఏమని చెప్పుకోను?" అన్నది జగదాంబ

"అవన్నీ నేను చూసుకొంటాను. ఇందులో మీకు ఏవిధమైన అపకీర్తి రానివ్వను

అపూర్వ సోదరి. ఏమీ దిగులుపడకండి. మీరు మాత్రం ఆ గాజులు, ఆ పువ్వులు తీసేసి తల కాస్త చింపిరి చేసుకోండి. గోపన్న వస్తున్నట్టుంది. వెంటనే బండి ఎక్కండి" అన్నాడు రాజేశ్వరరావు.

జగదాంబకి కాస్త ధైర్యం వచ్చింది. అతడు చెప్పినట్లు చేసి తిరిగి బండిలో కూర్చొన్నది.

"తమరు వెళ్లే రైలు మూడు గంటలు లేటుంట" అని వచ్చి చెప్పాడు గోపన్న.

"మూడు గంటలే ! అయితే లాభంలేదు. తిరిగి మమ్మల్ని నా బస వద్దకు చేర్చు" అన్నాడు రాజేశ్వరరావు.

బండి తిరుగుమొహం పట్టింది. సుబ్బరాజు ఇంటికి కాస్త దూరంగా ఆపించాడు రాజేశ్వరరావు. తను ఒక్కడూ వెళ్లి సుబ్బరాజు తలుపు తట్టాడు.

సుబ్బరాజు తలుపు తీశాడు. రాజేశ్వరరావు లోనికి వెళ్లి కూర్చొన్నాడు.

"ఇంకా మీరు పడుకోలేదా? ఇంత రాత్రి వరకు ఏమి చేస్తున్నారు ?" అని సుబ్బరాజు ప్రశ్నించాడు.

"ఇది ప్రత్యేకంగా భగవంతుడు నా కోసం ఏర్పరచిన రాత్రి. నే నెలా పడుకోగలను? ఒక ముఖ్యమయిన విషయం గురించి మీతో మాట్లాడడానికి వచ్చాను. నేను అడిగే ప్రశ్నకి సూటిగా జవాబు చెప్పండి. మీరు జగదాంబను నిజంగా ప్రేమిస్తున్నారా?" అని రాజేశ్వరరావు అడిగాడు.

సుబ్బరాజు ముఖం కందగడ్డలా చేసుకొన్నాడు. "ఈమధ్య మన ఇద్దరికీ కొంత చనువు ఏర్పడిన మాట నిజమే. కాని ఇటు వంటి ప్రశ్న మీరు వెయ్యడం చాలా తప్పు" అన్నాడు కోపంగా.

"అది నిజమే ననుకోండి. కాని ఒక వ్యక్తి చావు బ్రతుకులు మీ సమాధానం పైన ఆధారపడి ఉన్నవి. నేను చెప్పేది పూర్తిగా వింటే మీకే తెలుస్తుంది." అన్నాడు రాజేశ్వరరావు.

"వింటున్నాను" అన్నాడు సుబ్బరాజు ముక్తసరిగా.

"భోజనం ముగించి ఏమీ తోచక అలా తిరిగి వద్దామని వెళ్లాను. చెరువు సమీపించే

# బ్రహ్మముడి

సరికి ఎవరో వ్యక్తి ఆత్మహత్యకి ఉపక్రమిస్తున్నటు నాకు కనిపించింది. వెంటనే ఆమెను వారించాను. ఆమె ఎవరనుకున్నారు? జగదాంబ" అన్నాడు రాజేశ్వరరావు.

"ఏమిటీ? జగదాంబే ?" అన్నాడు సుబ్బరాజు అదిరిపడి.

"అవును. ఆ తరువాత ఆమెను బుజ్జగించి ఎందు కింత ఘోరమైన పనికి తల పెట్టిందో అడిగాను. చివరికి ఆమె నాతో యదార్థమంతా చెప్పింది. ఏనాటినుండో ఆమె మనస్సు మీపైన లగ్నమయిందనీ కాని, మిమ్మల్ని పొందే అవకాశం ఆమెకు ఇక లేదని నిరాశతో ఆపని చేస్తున్నట్లు చెప్పింది. ఆమెకు ధైర్యం చెప్పాను. ఆమెను స్వీకరించమని మిమ్మల్ని అభ్యర్థించడానికి ఇప్పుడు మీ వద్దకు వచ్చాను" అన్నాడు రాజేశ్వరరావు.

"ఎంత ఘోరం! నాకు మాత్రం ఆమె అంటే అభిమానం లేదా? ఒక్కమాట ఆమె ఎప్పుడైనా నాతో అనివుంటే యీపాటికి నేనామెను పువ్వుల్లో పెట్టి పూజించే వాడిని కదా ! అసలు నేనే ఆమెను ఈ విషయము అడగాలని అనుకొన్నాను. ఇవాళ సాయంత్రం ఆమాట నా నోటి చివరివరకు వచ్చింది కూడా. కాని ధైర్యం చాలలేదు. ఆమె ఇప్పుడు ఎక్కడ ఉన్నది? పదండి వెంటనే వెళ్లి తీసుకువద్దాం. మీరు పక్కన నిలబడితే నాకు బాగా ధైర్యం వస్తుంది." అన్నాడు సుబ్బరాజు లేస్తూ.

"ఆమె ఇక్కడే ఉన్నది. మీరు కూర్చోండి. నేను తీసుకొని వస్తాను" అంటూ రాజేశ్వరరావు వెళ్లాడు.

"అంతా జయం అయింది. మీరు ఆత్మహత్య చేసుకొంటున్నట్టు, నేను అడ్డు పడినట్టు సుబ్బరాజుతో చెప్పాను. దానితో అతడు పాత బస్సులాగ గడగడ లాడిపోతున్నాడు. మీకోసం ఎదురు చూస్తున్నాడు" అని జగదాంబతో చెప్పాడు.

జగదాంబ బండి దిగి రాజేశ్వరరావు వెనుక వచ్చింది.

"ఎంత ఘోరం తలపెట్టావు? నీకు యిది న్యాయమేనా? ఈ ఇల్లు, నాహృదయం కోసం ఎప్పుడూ తెరచే ఉంటాయని నీకు తెలియదా ? సమయానికి మాస్టారిని భగవంతుడు పంపించాడు. లేకపోతే ఏమైనట్టు? లే, లే, నా జగా—నా గదా—నా దంబా—" హడావడిలో ఆమె ముద్దుపేరు మరిచిపోయాడు సుబ్బరాజు.

"శుభం" అన్నాడు రాజేశ్వరరావు గట్టిగా ఊపిరి వదులుతూ.

"మేం వెంటనే ఎవరికి తెలియకుండా ఏ అన్నవరమో వెళ్లి దేవాలయంలో వివాహం చేసుకోవాలి. లేకపోతే ఈ వూళ్లో చాలా గొడవ జరుగుతుంది—" గోడ గడియారం వైపు చూశాడు సుబ్బరాజు— "అయ్యో, ఒంటిగంట దాటిపోయింది. లేకపోతే మాకు వెంటనే ప్యాసింజరు దొరికేది" అన్నాడు చేతులు నులుముకొంటూ.

"మీకు ఆ భయం అవసరంలేదు. ఆ ప్యాసింజరు మూడు గంటలు లేటని నాకు తెలిసింది. గోపన్న బండి బయట సిద్ధంగా ఉన్నది. అన్నీ పూహించే పెట్టెలో బట్టలు తెచ్చుకోమని జగదాంబగారితో నేను మొదటే చెప్పాను. ఇక మీ పెట్టె సర్దుకోవడమే ఆలస్యం" అన్నాడు రాజేశ్వరరావు సుబ్బరాజుతో.

క్షణంలో జగదాంబ సుబ్బరాజు కలిసి పెట్టె, బెడ్డింగు తయారు చేశారు.

"మీరు కూడా మాతో స్టేషనుకి రావాలి మాస్టారు. మీరు సాయంగా ఉంటే నాకు ధైర్యంగా ఉంటుంది." అన్నాడు సుబ్బరాజు.

రాజేశ్వరరావు గుండెలో రాయి పడింది. కాని కాదనలేకపోయాడు.

"అలాగే వస్తానులెండి. ఈ రాత్రంతా నేను పరోపకారానికే వినియోగించ దలిచాను" అన్నాడు విషాదంగా నవ్వుతూ.

రైలు కదులుతుంటే జగదాంబ అన్నది. "నీ మేలు నేను మరచిపోలేను రాజేశ్వరరావ్! నువ్వు స్వర్ణని వివాహం చేసుకోవడం నాకు ఇష్టమేనని నేను చెప్పినట్లుగా మా అన్నయ్యతో చెప్పు.

"పోతూ పోతూ బొల్లెద్దు కుడితొ" అన్నాడు రాజేశ్వరరావు.

25—2—66

కాని ఆ మాటలు జగదాంబకి వినిపించ లేదు. రైలు చక్రాలు తమ రొదలో తక్కిన శబ్దా లన్నిటిని లీనం చేసుకొన్నాయి.

రాజేశ్వరరావు స్టేషను బయటికి వచ్చాడు.

"గోపన్నా, ఈ రాత్రికి ఇది ఆఖరి ప్రయాణం. ఈ దేహాన్ని ఎలాగో నా బసకి చేర్పించు. ఈ రాత్రికి, ఈ అంధకారానికి అంతమంటూ లేదనుకొన్నాను. కాని అదిగో తూర్పు తెల్లవారుతోంది" అన్నాడు బండి ఎక్కుతూ.

ఉదయం పది గంట లవుతోంది. ఎవరో తలుపు కొట్టిన శబ్దంతో రాజేశ్వరరావుకు తెలివివచ్చింది. లేచి తలుపు తీశాడు. రామయ్యగారి పాలేరు ప్రత్యక్ష మయ్యాడు.

"అమ్మగారు మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నాడు పాలేరు.

అయితే రాత్రి తను వహించిన పాత్ర అప్పుడే రామయ్యగారింట్లో తెలిసిపోయిం దన్నమాట. అందుకే రమ్మంటున్నారు. తను వెళ్ళాక ఎంత రసాభాస అవుతుందో అను కొన్నాడు రాజేశ్వరరావు. ఇక తనకి స్వర్ణకి వివాహం జరగడం అన్నది ముమ్మాటికి కల్ల. ఈ జగదాంబ తనకి అన్నివిధాలా అపకారమే చేసింది.

"ముఖం కడుక్కొని స్నానంచేసి వస్తాను నువ్వు వెళ్ళు" అన్నాడు.

"మిమ్మల్ని వెంట వేసుకొని రమ్మన్నారు. మీరు వచ్చేవరకు నేను ఇక్కడే కూర్చుం టాను" అన్నాడు పాలేరు మఠంవేస్తూ.

అతడి వెంట వెళ్ళడం రాజేశ్వరరావుకి తప్పింది కాదు. అడుగు ముందుకు పడడం లేదు. ఎలాగో రామయ్యగారి ఇల్లు చేరాడు.

"రండి మాస్టారు" అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించింది పార్వతమ్మ. ఈ స్వాగతం అతడిని ఆశ్చర్యపరిచింది.

మండువాలో పీటవేసి అతడిని కూర్చో పెట్టింది. ప్లేటుతో ఏదో ఫలహారం తీసుకు వచ్చి అతడి ఎదుట పెట్టింది.

"నా బ్రతుకే ఒక కాళరాత్రి అను కొన్నాను మాస్టారు. ఈ అంధకారానికి ఇక అంతం లేదనుకొన్నాను. కాని ఇంతలోనే భళ్ళున తూర్పు తెల్లవారింది" అన్నది పార్వతమ్మ.

రాజేశ్వరరావు గతుక్కుమన్నాడు. ఈ న్నతో అన్నాడు. అయితే తను ఆడిన మాటలతో సహా జరిగినదంతాగోపన్నవీళ్ళకి చెప్పే ఉంటాడు. ఎంత ప్రమాదమయిను పరిస్థితిలో పడ్డాను! అనకొన్నాడు.

పార్వతమ్మ నవ్వింది. "అలా తెల్ల బోతున్నారేం మాస్టారు ! నా మాటలు మీకు అర్థంకాలేదనుకుంటాను. పది సంవత్సరాల నుండి ఈ ఇంటిని ఆవరించిన జగదాంబ పీడ ఈనాటితో వదిలింది. తిరిగి నా ఇంట్లో నాకు స్వతంత్రం లభించింది. సిగ్గులేని మనిషి—అన్నగారి పేర ఒక ఉత్తరం కూడా వ్రాసిపెట్టి వెళ్ళింది. రాత్రి మీరు వాళ్ళతో స్టేషనుకి వెళ్ళి నట్లు తెలిసింది" అన్నది.

"నేను స్టేషనుకి వెళ్ళానని ఎవరు చెప్పారు?" అన్నాడు రాజేశ్వరరావు.

"జగదాంబ, సుబ్బరాజుతో మీరుకూడా స్టేషనులో కనిపించారని, వాళ్ళ రైలు ఎక్కాక సామాన్లు మీరు అందించారని ఎవరో చూచినవారు మావారితో ఈ ఉద యము చెప్పారు" అన్నది.

రాజేశ్వరరావు ఒకసారి గట్టిగా వూపిరి వదిలాడు. అయితే గోపన్న వీళ్ళకి ఏమీ చెప్పలేదు. పూర్తి వివరాలు వీళ్ళకి తెలి యవు. కొంత నయం అనుకొన్నాడు.

ఇంతలో ఎక్కడినుండో రామయ్య గారు వచ్చారు. రాజేశ్వరరావుని చూసి కూడా పలకరించలేదు.

"ఈ ఇంటికి దరిద్రం పట్టుకొన్నది. ఆ పెళ్ళికొడుకు ఇవాళ రాడట. అసలు ఇప్పట్లోనే రాడట. ఇదిగో ఉత్తరం వచ్చింది." అంటూ ఉత్తరాన్ని పార్వతమ్మమీదకు గిర వాటు వేశారు.

పార్వతమ్మ ఆ ఉత్తరాన్ని విప్పకుండా అలాగే ప్రక్కకి తోసివేసింది.

"మన రాజేశ్వరరావు మాస్టారు కూర్చొ న్నారు. ఇంకా మీరు చూడలేదా ?" అంటూ భర్తకి విద్యుక్తధర్మాన్ని జ్ఞప్తికి తెచ్చింది.

"ఆ. చూడకేం ? చూశాను. ఏమయ్యా మాస్టారు. రాత్రి సుబ్బరాజుని, మా జగదాంబని స్టేషనుకి దిగబెట్టావట కదూ. ఇటువంటి ఉద్యోగాలుకూడా కొత్తగా ప్రారం భించావా?"అన్నారుఇంకొకవైపుచూస్తూ.


పెళ్ళికొడుకు ఇప్పట్లో రాడు అన్న మాటలు వినగానే రాజేశ్వరరావు మనస్సు ఒకసారి ఎగిరి గంతులేసింది. ఇప్పటివరకు అన్నీ శుభసూచకాలే అనుకొన్నాడు. అతడికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

"అసలు జరిగిందేమిటో తెలుస్తే మీరు నాతో ఈవిధంగా మాట్లాడరు" అన్నాడు రామయ్యగారితో.

"అదేమిటండి, అలా మాట్లాడతారు ? జరిగిన విషయం ఏదో ఈయన ద్వారా తెలును కోకుండా అలా నిందిస్తా రేమిటి ? ఇంతకీ మీ చెల్లెలికి బుద్ధిలేకపోయాక ఇత రులని అనుకొంటే ఏమిటి లాభం ?" అన్నది పార్వతమ్మ.

"జరిగిన దేమిటంటే—" చెప్పడం మొదలెట్టాడు రాజేశ్వరరావు—

"తెల్లవారుజామున మూడు గంటలకు



నా గది తలుపు ఎవరో కొట్టారు. లేచి తీశాను. జగదాంబ. ఎందుకు వచ్చారని అడిగాను. తూర్పు వెళ్లే ప్యాసింజరుకి తను అర్జెంటుగా వెళ్లవలసి వచ్చిందని, స్టేషను వరకు నన్ను సహాయం రమ్మని చెప్పింది. పార్వతమ్మ లేరా అన్నాను. లేరు అన్నది. రామయ్యగారు లేరా అన్నాను. వూళ్లో లేరు అన్నది. మీ పాప లతకి ప్రయివేటు చెప్ప వద్దన్నప్పటికీ, మీ గుమ్మం తొక్కవద్దని మీరు నాకు కబురు పంపినప్పటికీ, నాకు మాత్రం మీ అందరిపైన అభిమానం పోలేదు. మీ అవసరాలకి సహాయపడడమే నా ధ్యేయం. అందుచేత ఆమెకి సాయంగా స్టేషనుకి వెళ్లాను. మేము స్టేషనుకి చేరేటప్పటికి అక్కడ సుబ్బారాజు మాకు కలిశాడు. ఇద్దరికి టిక్కెట్లు అతడే కొన్నాడు. రైలు రాగానే ఇద్దరూ ఒకే పెట్టెలో కూర్చొన్నారు. అంతవరకు నాకు ఏ అనుమానం లేదు. కాని అప్పుడు సందేహం కలిగింది.

"మీ రిద్దరూ కలిసే వెళతారా ?" అని అడిగాను.

'అవును' అన్నారు వాళ్ళు. స్టేషనులో గంట కొట్టారు.

"ఏవూరు?' అన్నాను నేను.

'అన్నవరం' అన్నది జగదాంబ. గార్డు విజిలు కొట్టాడు.

## బ్రహ్మముడి

'ఎందుకు ?' అన్నాను నేను.

'పెళ్లికి' అన్నాడు సుబ్బారాజు. ఇంజను కూతవేసింది.

'ఎవరి పెళ్లి?' అన్నాను నేను.

'మా పెళ్లి!' అన్నారు ఇద్దరూను. రైలు కదిలిపోయింది.

"ఏం చేయను? అనవసరంగా ఈ వ్యవహారంలోకి నన్ను దింపారు. నాకు ఏ తల వంపులు వస్తాయో, ఎవరిచాత మాటలు పడాలో అని క్రుంగిపోతూ ఇంటికి దారి తీశాను" అని జరిగిన కథ చెప్పాడు రాజేశ్వరరావు.

"చూశారా ? పాపం అతడు అను కొన్నట్లే మీరు నిజం తెలుసుకోకుండా నిష్ఠూరం వేశారు" అన్నది పార్వతమ్మ భర్తతో.

"అవునండి మాష్టారు. వాళ్లిద్దర్నీ మీరు రైలు ఎక్కించడం చూచినవాళ్లెవరో చెప్తే నేను అన్యథా భావించాను. అది చేసిన పనికి నా మనస్సు వికలమయిపోయింది. నా బాధ మీరు గుర్తిస్తారనే నేను అను కొంటున్నాను" అన్నారు రామయ్యగారు ప్రాధేయపడుతూ.

"మీరెంత బాధపడుతున్నారో నాకు పూర్తిగా తెలుసును" అన్నాడు రాజేశ్వరరావు.

"ఒకసారి ఇటురా వస్తారా" అంటూ భర్తని వంటింటిలోకి తీసుకొని వెళ్లింది పార్వతమ్మ.

"స్వర్ణని వివాహం చేసుకోమని అతడిని కోరండి. అతడికీ స్వర్ణ అంటే ఎంతో ప్రేమ. సంతోషంగా అంగీకరిస్తాడు. ఆ జగదాంబ బావగారి అబ్బాయి గురించి మనం ఆశ వదులుకోవలసిందే, ఉదయంనుండి నేను అదే ఆలోచిస్తున్నాను. అసలే వాళ్లు ఇష్టంలేనట్లు కనబడుతున్నారు. ఇప్పుడు జగదాంబ ఇటువంటి పని చేసిందని తెలుస్తే వాళ్లు ఎంతమాత్రం చేసుకోరు. ఇతడిని ఈపూట ఇక్కడే భోజనంచేసి వెళ్ల మని చెప్పండి" అని రహస్యంగా చెప్పింది.

కాని పొంచి వింటున్న స్వర్ణకి ఈ రహస్యం వినిపించింది. ఆమె ఆనందాన్ని పట్ట లేకపోయింది. ఒక్క పరుగున చావిట్లోకి దారితీసింది. అదే సమయానికి రాజేశ్వరరావు కూడా చావిట్లో ప్రవేశించాడు. అతడిని చూచి సిగ్గుతో తిరిగి స్వర్ణ పారి పోవడానికి ప్రయత్నించింది. రాజేశ్వరరావు ఆమె చెయ్యి పట్టుకొన్నాడు.

"ఈ కొత్త సిగ్గేమిటి ? ని ముఖం ఆనందంతో కలకలలాడిపోతోంది. ఏమిటి కథ?" అని అడిగాడు.


"ఇంకేముంది ? మన ఆశయం ఈనాటికి ఫలించింది" అన్నది స్వర్ణ చిన్న గొంతుకతో.

"హుర్రే ! ఇప్పటికి లైన్ క్లియర్ అయిందన్నమాట" అంటూ స్వర్ణని అమాంతంగా ఎత్తి కుర్చీలో కూర్చోబెట్టాడు రాజేశ్వరరావు.

"అన్నట్టు లైన్ క్లియరంటే జ్ఞాపకం వచ్చింది. ఇందాకటి, రాత్రి జరిగిన కథ ఎంత తమాషాగా కల్పించి చెప్పారు! నిజంగా ఏమిటి జరిగిందేమిటి?" అని స్వర్ణ ప్రశ్నించింది.

రాజేశ్వరరావు తెల్లబోయాడు. "అదేమిటి ? నిజంగా జరిగిందే చెప్పాను" అన్నాడు.

"అలాగా ! అయితే ఈ ప్రశ్నలకి జవాబు చెప్పండి. మా అత్తయ్య మీ బసకి ఎన్ని గంటలకి వచ్చిందన్నారు ?"



"సరిగ్గా మూడు గంటలకి రాత్రి ఎప్పుడు లేచినా నాకు టైము చూడడం అలవాటు."

"మరి తూర్పు వెళ్లే ప్యాసింజరు ఒంటి గంటకి వస్తుంది. ఆ రైలు అందుకోవడం అసాధ్యం అని ఆమెతో మీరు ఎందుకు చెప్పలేదు ?"

"అందకపోవడ మేమిటి ? అది మూడు గంటలు లేటు కదూ. నాలుగు గంటలకి వచ్చింది. మేము స్టేషనుకి చేరడానికి ఒక గంట పట్టింది. అంతా సరిగ్గా సరిపో యిందే."

"అదే ! మీరు వేసిన లెక్క సరిపో యింది. కాని స్టేషనుకి వెళ్లకుండానే ఆ ప్యాసింజరు మూడు గంటలు లేటని మీకు ఎలా తెలిసింది.? బహుశ కల వచ్చి ఉంటుంది" అన్నది స్వర్ణ నవ్వుతూ.

"ఏమిటీ, ఏమిటీ" అంటున్నాడు రాజేశ్వ ర్రావు గాభరాపడుతూ.

"మీ సహాయం కోరుతూ జగదాంబ మీ బసకి వచ్చిందని చెప్పినప్పుడే మీ కథ నిజంకాదని రూఢి అయింది. మీ ఇల్లు సుబ్బరాజు ఇల్లు ఒకటే. ఆమె అక్కడి వరకు వచ్చి మీ సహాయం కోరడమేమిటి ? అదిగాక మీరంటే ఆమెకి ఎంత కోపమో అందరికి తెలుసును. అటువంటిది మీ సహా యాన్ని అర్థిస్తూ ఆమె మీ వద్దకు వస్తుందా" అన్నది స్వర్ణ.

"భేష్, స్వర్ణా నీ తెలివితేటలు అద్భుతం వయం. నీవద్ద ఏదీ దాచడానికి వీలులేదని ముందుగానే తెలియచెప్పావ్! నేను మీవాళ్లతో చెప్పిందంతా ప్యూర్ గ్యాస్. నిజం కథ వేరే ఉన్నది. సావకాశంగా నీతో చెప్తాలే" అన్నాడు రాజేశ్వర్రావు నవ్వుతూ.

"రాజేశ్వర్రావ్! ఈపూట నువ్వు ఇక్కడే భోజనం చెయ్యాలి సుమా. అన్నట్లు నీతో ఒక ముఖ్యమయిన విషయం గురించి మాట్లాడాలి. ఇలా నాతో వస్తావా?" అంటూ రామయ్యగారు చావిట్లోకి వచ్చారు.

"పదండి నేను సిద్ధంగానే ఉన్నాను" అంటూ ఆయన వెంటపడ్డాడు రాజేశ్వర్రావు.







